సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 14 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.42వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.42 వేలు పలికాయి. మార్కెట్‌కు 864 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



అహుడా ఏపీఓగా ఇస్సాక్ అహ్మద్

అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా) అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా ఇస్సాక్ అహ్మద్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు.



జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలిక పాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

15 మంది డీటీలకు ఉద్యోగోన్నతి

అనంతపురం అర్బన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో 15 మంది డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు భూ పరిపాలన ముఖ్య కమిషనర్ సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జోన్–4 (రాయలసీమ 8 జిల్లాలు) పరిధిలో 45 మంది డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ క్రమంలో అనంతపురం జిల్లాలో ముగ్గురు డిప్యూటీ తహసీల్దార్లు ఎస్.సైఫుల్లాహక్, డి.ఓబులేసు, ఎ.శేషారెడ్డికి, శ్రీసత్యసాయి జిల్లాలో 12 మంది డిప్యూటీ తహసీల్దార్లు ఎ.శ్రీనివాసులు, టి.ఆర్.జమానుల్లాఖాన్, ఎస్.బి.భాస్కర్, బి.నరేంద్రకుమార్, వై.రామనాథ్‌రెడ్డి, కె.రమాదేవి, ఎస్.హమీద్‌బాషా, సయ్యద్ షాబుద్దీన్, ఆర్.రవికుమార్, డి.రమేష్‌బాబు, జి.పి.శోభసువర్ణమ్మ, ఎస్.మురషావలికి ఉద్యోగోన్నతి లభించింది. వీరు ఆయా జిల్లాల కలెక్టర్ల వద్ద రిపోర్టు చేసుకోవాలి. అటు తరువాత కలెక్టర్ వారికి మండలాలను కేటాయిస్తూ పోస్టింగ్ ఇస్తారు.

రీసర్వే వేగవంతం చేయాలి

- జాయింట్ కలెక్టర్ చేతన్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: ఎంపిక చేసిన గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి తహసీల్దార్లు, సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రీ సర్వే, మ్యుటేషన్స్, వివిధ ప్రాజెక్టులకు భూ సేకరణ తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో రెండో విడతకు ఎంపిక చేసిన 128 గ్రామాల్లో రీ సర్వే గడువులోపు పూర్తి చేయాలన్నారు. ఇందుకోసం తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, విలేజ్ సర్వేయర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తొలి విడత రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. మ్యుటేషన్ దరఖాస్తులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీపీ బాధ్యతల స్వీకరణ



ఆర్డీటీపీ సంజీవ్‌కుమారన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

అనంతపురం క్రైం: అనంతపురం నూతన రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ (ఆర్డీటీపీ) సంజీవ్‌కుమారన్ మంగళవారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు. అనంతరం ఆయన వివిధ జిల్లాల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు.

నేతన్నకు చేయూత

పెళ్లి..శుభకార్యం... ఏదైనా ధర్మవరం పట్టు తళుక్కున మెరవాల్సిందే. జిల్లా నేతన్నలు ఎంతో నైపుణ్యంతో తయారు చేసే చీరలు దేశవిదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. కానీ కొత్త కొత్త డిజైన్లు మార్కెట్‌ను ముంచెత్తుతుండగా, ధర్మవరం చీర సీజన్‌కే పరిమితమవుతోంది. ఫలితంగా నేతన్నకు ఉపాధికి ఇబ్బందిగా మారింది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం నేతన్నకు శిక్షణ ఇప్పించేందుకు సిద్ధమైంది. రాయితీ పరికరాలూ అందిస్తోంది.

- ఆధునిక డిజైన్లపై చేనేతలకు నైపుణ్య శిక్షణ
- రూ.20 కోట్లు వ్యయం చేస్తున్న సర్కార్
- శిక్షణ పూర్తయ్యాక 90 శాతం రాయితీతో పరికరాలు
- మగ్గం అభివృద్ధికి 'ముద్ర' రుణాలు



ధర్మవరం: పట్టుచీర అంటే వెంటనే గుర్తొచ్చేది శ్రీసత్యసాయి జిల్లానే. ధర్మవరం, పుట్టపర్తి, కొత్తచెరువు, గోరంట్ల, బుక్కపట్నం, సోమందేపల్లి, పెనుకొండ, హిందూపురం, చిలమత్తూరు మండలాల్లో 28 వేల దాకా చేనేత మగ్గాలున్నాయి. జిల్లా నేతన్నలు తయారు చేసిన పట్టుచీరలు అంతర్జాతీయంగా పేరుగాంచాయి. అయితే ఫ్యాషన్ ప్రపంచంలో రోజుకో డిజైన్ చీర మార్కెట్‌లో తళుక్కుమంటుండగా, ధర్మవరం పట్టుచీరకు డిమాండ్ తగ్గుతోంది. దీంతో అన్‌సీజన్‌లో వ్యాపారం లేక చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం నేతన్నకు చేయూత ఇవ్వాలని భావించింది. ఇందుకోసం వారికి నైపుణ్య శిక్షణ అవసరమని గుర్తించి చర్యలు చేపట్టింది.

పది చేనేత క్లస్టర్లు...రూ.20 కోట్లు

జాతీయ చేనేత అభివృద్ధి పథకం కింద నేతన్నలకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ క్రమంలో చేనేత ప్రధాన కేంద్రాలైన ధర్మవరం, హిందూపురం, సోమందేపల్లిలో రూ.20 కోట్ల వ్యయంతో చేనేత కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇవ్వనుంది. ఇందులో భాగంగా ఆయా రంగాల నిపుణులచేత డిజైనింగ్, రంగుల అద్దకం, మార్కెటింగ్ తదితర అంశాలపై నైపుణ్య శిక్షణ ఇప్పిస్తారు. ఒక్కో చేనేత క్లస్టర్ పరిధిలో 300 మంది దాకా చేనేత కార్మికులకు శిక్షణ ఇచ్చేలా, జిల్లా వ్యాప్తంగా మొత్తం 3 వేల మందికి మేలు జరిగేలా అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. త్వరలోనే వారికి నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



కార్మికులకు చీర డిజైన్‌పై అవగాహన కల్పిస్తున్న నిపుణులు (ఫైల్)

నైపుణ్య శిక్షణ, 90 శాతం రాయితీతో పరికరాలు

చేనేత కార్మికులకు ఆధునిక డిజైన్‌లపై అవగాహన కల్పిస్తారు. నూతన డిజైన్లు ఎలా తయారు చేయాలి..., ఏ డిజైన్‌కు మార్కెట్‌లో ఎక్కువగా డిమాండ్ ఉంది.. తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. అలాగే రంగుల అద్దకం, కలర్ కాంబినేషన్లు ఎలా చేయాలి. ఇతర ప్రాంతాల్లో ఏయే డిజైన్లు తయారు చేస్తున్నారు... వాటిని చేనేత ఉత్పత్తులకు ఎలా అన్వయించాలి అనే విషయాలపై 45 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న కార్మికులకు 90 శాతం రాయితీతో చేనేత మగ్గం పరికరాలను అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో గుంత మగ్గంపై పనిచేసే కార్మికులు రాయితీతో ఆధునిక పరికరాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

చేనేత అభివృద్ధికి 'ముద్ర' రుణాలు

చేనేత కార్మికులు మగ్గాన్ని అభివృద్ధి చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం 20 శాతం రాయితీ, 6 శాతం వడ్డీతో 'ముద్ర' రుణాలు బ్యాంకుల ద్వారా ఇప్పిస్తోంది. జిల్లా పరిధిలోని 1,710 యూనిట్లకు ఇప్పటికే 'ముద్ర' రుణాలు మంజూరయ్యాయి. కార్మికులు ఆయా చేనేత కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన బ్యాంకుల వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకుంటే అధికారులు మగ్గాలను పరిశీలించి రుణాలను మంజూరు చేస్తారు.

సబ్సిడీతో మగ్గం పరికరాలు



ధర్మవరం, హిందూపురం, సోమందేపల్లిలో జాతీయ చేనేత అభివృద్ధి పథకం కింద త్వరలోనే నైపుణ్య శిక్షణ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ అవకాశాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వమే 90 శాతం రాయితీతో మగ్గం పరికరాలను అందిస్తుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరం చేశాం.

–రమేష్, ఏడీ, చేనేత జౌళిశాఖ

జిల్లాలో చేనేత కేంద్రాలు: ధర్మవరం, హిందూపురం, సోమందేపల్లి

10 చేనేత క్లస్టర్లు

ప్రభుత్వం ఖర్చు చేయనున్న వ్యయం

రూ.20 కోట్లు

నైపుణ్యాన్ని పెంచుకొని ఉపాధి పొందనున్న కార్మికులు

3 వేల మంది

ముద్ర రుణాలు మంజూరైన యూనిట్లు

1,710

ఎంతో ఉపయుక్తం



నైపుణ్య శిక్షణ ఇవ్వడం వల్ల చేనేత కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మెరుగైన సంపాదనతో పాటు 90 శాతం రాయితీతో మగ్గం పరికరాలు అందుతాయి. తద్వారా చేనేతలు మగ్గాలను అభివృద్ధి చేసుకుని ఆధునిక డిజైన్లతో చీరలు నేసుకునే వీలుంటుంది.

–వెంకటరమణ, చేనేత కార్మికుడు, ధర్మవరం

అనుమతి రాగానే శిక్షణ



చేనేత క్లస్టర్ ద్వారా కార్మికులకు డిజైనింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తు చేసుకున్నా. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే శిక్షణ ఇస్తా. గతంలో కూడా నేను చేనేత క్లస్టర్ ద్వారా కార్మికులకు డిజైనింగ్‌పై శిక్షణ ఇచ్చా. నైపుణ్య శిక్షణ తర్వాత కార్మికులకు మెరుగైన ఉపాధి దొరుకుతుంది.

–జుజారు నాగరాజు, పట్టుచీరల డిజైనర్, ధర్మవరం

నిందితుడు 'నితిన్‌సాయి' మేనేజరే

- విజిలెన్స్ ఏడీ ల్యాప్‌టాప్ చోరీ కేసులో మిస్టరీని ఛేదించిన పోలీసులు
- సీసీ ఫుటేజీల ఆధారంగా బట్టబయలైన బండారం..శంకర్‌రెడ్డి అరెస్ట్

ధర్మవరం: విజిలెన్స్ శాఖ ఏడీ ల్యాప్‌టాప్ చోరీ కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. రోడ్డు పనుల నాణ్యతలో డొల్లతనం బట్టబయలవుతుందనే భయంతో నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యం సూచన మేరకు ఆ కంపెనీ మేనేజర్ శంకర్‌రెడ్డి ల్యాప్‌టాప్ చోరీ చేసినట్లు నిగ్గు తేల్చారు. ఆ వివరాలను ముదిగుబ్బ సీఐ కంబగిరి రాముడు వెల్లడించారు.

అక్రమాల వివరాలన్నీ ల్యాప్‌టాప్‌లోనే.

ముదిగుబ్బ నుంచి మలకవేముల క్రాస్ వరకూ రహదారి పనులను నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ చేపట్టింది. పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలివ్వడమే కాక, నిబంధనలకు విరుద్ధంగా మొబైల్ క్రషర్లను వినియోగిస్తున్నట్లుగా ఫిర్యాదులు అందాయి. దీంతో మైనింగ్ అండ్ విజిలెన్స్ ఏడీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈనెల 6న తనిఖీలు చేపట్టగా అక్రమాలు బట్టబయలయ్యాయి. ఈ వివరాలన్నీ అధికారులు ల్యాప్‌టాప్‌లో నిక్షిప్తం చేశారు.



విజిలెన్స్ అధికారుల వాహనం నుంచి ల్యాప్‌టాప్‌ను తీసుకెళుతున్న దృశ్యం (సీసీ ఫుటేజీ)

వాహనంలో నుంచి ల్యాప్‌టాప్ అపహరణ

తనిఖీల అనంతరం విజిలెన్స్ ఏడీ విజయలక్ష్మి.. మధ్యాహ్న ముదిగుబ్బలోని ఓ హోటల్‌లో భోజనానికి వెళ్లగా.. అదే సమయంలో ఆమె కారులో ఉంచిన ల్యాప్‌టాప్‌ను నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్స్ మేనేజర్ శంకరరెడ్డి అపహరించుకెళ్లాడు. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. ఘటనపై అప్పట్లో కేసు నమోదు చేసిన ముదిగుబ్బ పోలీసులు ల్యాప్‌టాప్ చోరీ జరిగిన ప్రదేశంలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి మంగళవారం శంకరరెడ్డి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. దీంతో శంకర్‌రెడ్డితో పాటు నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యంపై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గృహ'మస్తు'

- జిల్లాలో చకచకా ఇళ్ల నిర్మాణాలు
- కాలనీల్లో మౌలిక వసతుల కల్పన
- పుష్కలంగా తాగునీటి సౌకర్యం
- నిరంతరాయంగా విద్యుత్ వెలుగులు
- ఊరూవాడా గృహ ప్రవేశాలు
- నిరుపేద ఇంట సంతోషాలు

సాక్షి, పుట్టపర్తి: గతంలో ఎన్నడూ లేని విధంగా.. ఏ ప్రభుత్వం చేయని తరహాలో.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అన్ని చర్యలూ చేపట్టింది. ముఖ్యంగా నిరుపేదల చిరకాల స్వప్నమైన సొంతింటి కల సాకారానికి చేయూతనిచ్చింది. 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అర్హులందరికీ ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇస్తోంది. ఆయా లేఅవుట్‌లలో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఫలితంగా జగనన్న కాలనీల పేరుతో వెలసిన ఊళ్లలో నిరంతర తాగునీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా జరుగుతోంది. అందువల్లే ఇప్పటికే పలువురు లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేశారు.

ముమ్మరంగా సాగుతున్న పనులు

జిల్లాకు 62,237 ఇళ్లు మంజూరుకాగా, ఐదు వేలు మినహా మిగతా నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. గత 15 రోజుల ప్రగతి పరిశీలిస్తే.. నిర్దేశించిన లక్ష్యంలో 90 శాతంపైగా నిర్మాణాలు పూర్తయినట్లు గృహ నిర్మాణ శాఖ నివేదికల ద్వారా తెలుస్తోంది. గత మే 15 నుంచి 31 తేదీల మధ్య 6,218 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని నిర్దేశించగా.. ఈ నెల 1వ తేదీ నాటికి 5,373 పూర్తి చేశారు. గత 15 రోజుల ప్రగతిలో రాష్ట్రంలో శ్రీసత్యసాయి జిల్లా ఆరో స్థానంలో నిలవడం నిలవగా, అనంతపురం జిల్లా నాల్గోస్థానం దక్కించుకుంది.



పుట్టపర్తి మున్సిపాలిటీ బ్రాహ్మణపల్లి లేఅవుట్‌లో ఓ లబ్ధిదారు నిర్మించుకున్న ఇల్లు

సౌకర్యాల కల్పనకు పెద్దపీట

జిల్లాలో ఇప్పటి వరకు 10,757 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఆయా నివాసాలకు 100 శాతం విద్యుత్ సౌకర్యం కల్పించారు. గత 15 రోజుల వ్యవధిలోనే 930 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. అదేవిధంగా పూర్తయిన నివాసాలకు నీటి సౌకర్యం కూడా కల్పించారు. జగనన్న కాలనీల్లో బోర్లు వేసి పైప్‌లైన్ తవ్వించి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు. గత 15 రోజుల్లోనే 884 ఇళ్లకు నీటి వసతి కల్పించారు. దీంతో జగనన్న కాలనీల్లో నిర్మాణాలు ఊపందుకున్నాయి. నిరుపేదలు వీలైనంత త్వరగా ఇంటి నిర్మాణం పూర్తిచేసుకుని గృహప్రవేశాలు చేయాలని భావిస్తున్నారు.

జగన్ మేలు మరువలేం



పేదరికం కారణంగా ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లలో జీవనం నెట్టుకొచ్చాం. గతంలో ఏ ప్రభుత్వమూ మా గురించి పట్టించుకోలేదు. కానీ సీఎం జగన్ జిల్లా కేంద్రంలో స్థిరమైన ఆస్తి ఇచ్చి మాకు మేలు చేశారు. మా సొంతింటి కలను సాకారం చేశారు. అలాగే కాలనీల్లో మౌలిక వసతులన్నీ కల్పించారు. సీఎం చేసిన మేలు ఎప్పటికీ మరువలేం – పెద్దక్క, వివేకానంద రోడ్డు, పుట్టపర్తి

ఎలాంటి ఇబ్బందీ లేదు



సొంతింటి కల జగన్ తోనే సాకారమైంది. స్థలంతో పాటు ఇల్లు కట్టించి ఇచ్చారు. ఇటీవల నూతన గృహంలో ప్రవేశించాం. విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఇంటింటికీ కుళాయి బిగించి నీరందిస్తున్నారు. రోడ్లు సిద్ధం అవుతున్నాయి. ఇక మాకు ఎలాంటి ఇబ్బందీ లేదు.

– ధనలక్ష్మి, పోతులనాగేపల్లి, ధర్మవరం

త్వరలోనే లక్ష్యం పూర్తి



ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తున్నాం. సకాలంలో లక్ష్యం పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ఆయా లేఅవుట్లకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూస్తున్నాం. అలాగే సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం.

– చంద్రమౌళి, పీడీ, గృహనిర్మాణ శాఖ

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య



చెరువు నీటిలో తేలుతున్న లలిత మృతదేహం

అమరాపురం: జీవితంపై విరక్తితో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... అమరాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు, లలిత (52) దంపతులు. వీరికి వివాహమై 30 ఏళ్లు గడిచినా సంతానం కలగలేదు. ఈ క్రమంలో అనారోగ్య సమస్య తలెత్తడంతో 12 ఏళ్ల క్రితం గర్భసంచిని వైద్యులు తొలగించారు. అప్పటి నుంచి సంతానం లేదన్న దిగులు ఆమెను మరింత కుంగదీసింది. ఇటీవల దీర్ఘకాలిక వ్యాధులు చుట్టుముట్టడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమెకు అన్ని సర్దుకుంటాయని, ధైర్యంగా ఉండాలని భర్త ధైర్యం చెప్పి సోమవారం వ్యాపార నిమిత్తం కర్ణాటకలోని శిర పట్టణానికి వెళ్లాడు. అప్పటికే మానసికంగా కుదేలైన ఆమె.. గ్రామ శివారులోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం ఉదయం ఆమె మృతదేహం నీటిలో తేలుతుండడం గమనించిన స్థానికుల సమాచారం మేరకు అన్న జీపీ రాజు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న భర్త సైతం శిర నుంచి ఆగమేఘాలపై తిరిగి వచ్చాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఐటీఐలో ప్రవేశాలకు నేడు కౌన్సెలింగ్

లేపాక్షి: పారిశ్రామిక శిక్షణకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు లేపాక్షిలోని ప్రభుత్వ ఐటీఐలో బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు పాలీసెట్ జిల్లా కన్వీనర్ పి.రాయపురెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఈ ఏడాది చేపట్టిన ప్రవేశాలకు సంబంధించి తొలి విడత అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయించుకున్న విద్యార్థులు కౌన్సెలింగ్ హాజరు కావాలి. విద్యార్థులు సాధించిన మార్కులు, జీపీఏ ఆధారంగా కౌన్సిలింగ్ ట్రేడ్లను కేటాయించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మెరిట్ జాబితాలో 1 నుంచి 27వ స్థానంలో ఉన్న వారికి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెరిట్ జాబితాలో 28 నుంచి 54 స్థానంలో ఉన్నవారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలి.

'ప్రకృతి'కి సలాం

ఈమె పేరు లక్ష్మీదేవమ్మ. చిలమత్తూరు మండలం టేకులోడు గ్రామం. ఎకరా విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టి కూరగాయలు పండిస్తోంది. సొంతంగా ఎరువులు, విత్తనాలు ఉత్పత్తి చేసుకోవడంతో పంట ఖర్చు రూ.15 వేలకు మించడం లేదు. ఏడాదిలో మూడు పంటలు వేసి రూ.2.5 లక్షల ఆదాయం గడిస్తోంది.



గత ఏడాది ప్రకృతి వ్యవసాయం లక్ష్య సాధన ఇలా..	
ఎంపిక చేసిన రైతుల సంఖ్య	40,076 మంది
ప్రకృతి వ్యవసాయం సాగించిన రైతులు	39,916 మంది
నిర్దేశించుకున్న సాగు విస్తీర్ణం	54,623 ఎకరాలు
ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణం	54,412 ఎకరాలు

- ఏటా పెరుగుతున్న 'ప్రకృతి' సాగు విస్తీర్ణం
- రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో మరింత ఉత్సాహం
- తక్కువ ఖర్చుతో అధిక లాభాలు
- పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్

సాక్షి, పుట్టపర్తి: వ్యవసాయంలో పెరుగుతున్న పెట్టుబడులు, తగ్గుతున్న నాణ్యతలు సేంద్రియ సేద్యం వైపు రైతులను నడిపిస్తున్నాయి. రసాయనిక ఎరువులు, పురుగు మందుల ధరలు కూడా ఏటా గణనీయంగా పెరుగుతుండడంతో సహజ సిద్ధ పంట ఉత్పత్తులకు అన్నదాతలు మొగ్గు చూపిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తుండడంతో ఆ దిశగా రైతులు అడుగులు వేస్తున్నారు. వ్యవసాయాన్నే నమ్ముకున్న రైతులకు పంటల సాగు లాభాసాటిగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం సైతం తోడ్పాటును అందిస్తోంది. దీంతో ఏటా జిల్లాలో ప్రకృతి సేద్యం సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. వరి, పత్తి, మిరప, పసుపు, అరటి, మినుము, పెసర, కూరగాయలు తదితర పంటలను సేంద్రియ పద్ధతిలో పండిస్తున్నారు.

ఈ ఏడాది నిర్దేశించుకున్న ప్రకృతి వ్యవసాయం లక్ష్యం	
ఎంపిక చేసుకున్న రైతుల సంఖ్య	53,255 మంది
ఎంపిక చేసిన సాగు విస్తీర్ణం	84,020 ఎకరాలు

ప్రభుత్వ ప్రోత్సాహంతో పెరుగుతున్న సాగు విస్తీర్ణం

ప్రకృతి వ్యవసాయంపై ప్రభుత్వం మరింత శ్రద్ధ పెట్టడంతో జిల్లాలోని రైతులు ఈ విధానానికి ఆకర్షితులయ్యారు. ప్రకృతి వ్యవసాయ ప్రధాన గ్రామాలను అధికారులు ఎంపిక చేసి సాగును ప్రోత్సహిస్తూ వస్తున్నారు. గత ఏడాది 40,076 మంది రైతులతో 54,623 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయంతో పంటలు సాగు చేపట్టాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకోగా 39,916 మంది రైతులతో 54,415 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని విజయవంతంగా చేపట్టారు. ఈ ఏడాది 53 వేల మంది రైతులతో 84 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి, ఆ దిశగా రైతులను ప్రోత్సహిస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనాలు

- ప్రకృతి వ్యవసాయం చేయడం వలన నేలకు, వాతావరణానికి, మానవాళి మనుగడకు అన్ని రకాలుగా ఆరోగ్యకరమని శాస్త్రీయ ఆధారాలు రుజువు చేశాయి.
- పంటల సాగుకు పెట్టుబడి తక్కువ, దిగుబడి ఎక్కువగా ఉంటుంది.
- తెగుళ్ల బెడద తక్కువ, ఉత్పత్తులు నాణ్యతగా... తాజాగా ఉంటాయి.
- మార్కెట్‌లో 10 నుంచి 15 శాతం అదనపు ధర లభిస్తుంది.
- అంతర పంటలకు ప్రాధాన్యతనివ్వడం వల్ల ప్రధాన పంటతో పాటు అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం గడించవచ్చు.

మార్కెటింగ్ సదుపాయం బాగుంది



సేంద్రియ పంటల ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం బాగుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంచి ప్రోత్సాహం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన ప్రకృతి వ్యవసాయ విధానాలు ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. దీనికి తోడు ఇప్పుడిప్పుడే చాలా మంది రైతులు ప్రకృతి సేద్యం వైపు మొగ్గు చూపుతున్నారు.

– లక్ష్మానాయక్, ప్రాజెక్టు మేనేజర్, ప్రకృతి వ్యవసాయ విభాగం

సీఎంను కలసిన రమేష్‌గౌడ్



సీఎం జగన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న రమేష్‌గౌడ్

అనంతపురం క్రైం: తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు జ్ఞాపికను అందజేశారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభ్యున్నతికి చేయూతనిచ్చినందుకు రాష్ట్రంలోని బీసీలందరూ రుణపడి ఉంటారని తెలిపారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సుల సీజ్

అనంతపురం సెంట్రల్: జిల్లా వ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా తిప్పుతున్న ఐదు స్కూల్ బస్సులను రవాణా శాఖ అధికారులు సీజ్ చేశారు. ఈ మేరకు ఉప రవాణా కమిషనర్ వీర్రాజు తెలిపారు. మంగళవారం తాడిపత్రి, గుంతకల్లు ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో ఫిట్‌నెస్ లేని బస్సులను గుర్తించి సీజ్ చేసినట్లు వివరించారు.

పునాది పడని ఇళ్లను రద్దు చేస్తాం

- ఇళ్లు గ్రౌండింగ్ చేయని సిబ్బందిపై కఠిన చర్యలు
- కలెక్టర్ అరుణ్‌బాబు హెచ్చరిక



దొన్నికోట గ్రామంలో నిర్మిస్తున్న ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నల్లమాడ: 'నవరత్నాలు..పేదలందరికీ ఇళ్లు' పథకం కింద ఇల్లు మంజూరైన ప్రతి ఒక్కరూ నిర్మాణాలు చేపట్టాలని, ఇప్పటికీ పునాది వేయని వారి ఇళ్లు రద్దు చేసి అవసరమైన వారికి మంజూరు చేస్తామని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన నల్లమాడ మండలంలోని దొన్నికోట, రెడ్డిపల్లి వద్ద ఉన్న జగనన్న హౌసింగ్ లేఅవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ.. హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దొన్నికోట, రెడ్డిపల్లి హౌసింగ్ లేఅవుట్లలో నేటికీ ప్రారంభం కాని ఇళ్ల నిర్మాణాలను రెండురోజుల్లో ప్రారంభించాలని, ఇళ్ల గ్రౌండింగ్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఇంజినీరింగ్ సహాయకులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. పుట్టపర్తి నియోజకవర్గంలో నిర్మాణం ప్రారంభం కాని ఇళ్లను బుధవారం నిర్వహించే ప్రత్యేక డ్రైవ్‌లో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు కలెక్టర్ ఆదేశించారు. జగనన్న లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు. ఇల్లు మంజూరైనా నిర్మాణం ప్రారంభించకపోతే రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, ఆర్డీఓ భాగ్యరేఖ, మండల ప్రత్యేకాధికారి నిర్మలాజ్యోతి, ఎంపీడీఓ కొండన్న, తహసీల్దార్ దేవేంద్ర నాయక్, హౌసింగ్ ఏఈ వరుణ్, దొన్నికోట, రెడ్డిపల్లి సర్పంచ్‌లు రాగినేని సరస్వతి, ప్రసాద్, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

జగన్‌తోనే విద్యారంగం బలోపేతం

- ఉమ్మడి జిల్లా పీఆర్ ఇంజినీర్ల సంఘం గౌరవాధ్యక్షుడు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి



విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న భాస్కర్‌రెడ్డి

పుట్టపర్తి: దేశంలో ఎక్కడా లేని విధంగా విప్లవాత్మక సంస్కరణలతో విద్యారంగాన్ని బలోపేతం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఉమ్మడి అనంతపురం జిల్లా పీఆర్ ఇంజినీర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. బుక్కపట్నంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేసి, మాట్లాడారు. మనబడి నాడు–నేడు కార్యక్రమంతో రూ.వేల కోట్లు ఖర్చు చేసి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను సీఎం వైఎస్ జగన్ తీర్చి దిద్దారన్నారు. బడి ఈడు పిల్లలను చదువులవైపు ఆకర్షించేలా అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టి నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి జగనన్న విద్య, వసతి దీవెన పథకలతో ఆదుకుంటున్నారన్నారు. విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా నిలిచాయని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఆవుటాల రమణారెడ్డి, బుక్కపట్నం సొసైటీ అధ్యక్షుడు రామలింగారెడ్డి, హెచ్‌ఎం అబ్దుల్ రహిమాన్, నాయకులు తల్లం మల్లికార్జున, పూలకుంట్ల నాగభూషణ, యూసఫ్, ఎంపీటీసీ సభ్యురాలు పద్మావతి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు నివారించాలి

ప్రశాంతి నిలయం: రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకుని మాతాశిశు మరణాలను పూర్తి స్థాయిలో నివారించాలని పీహెచ్‌సీ వైద్యాధికారులను డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్‌వీ కృష్ణారెడ్డి ఆదేశించారు. జిల్లాలో ఇటీవల చోటు చేసుకున్న మాతాశిశు మరణాలపై సంబంధిత పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బందితో మంగళవారం తన కార్యాలయంలో ఆయన సమీక్షించారు. ఇటీవల రామగిరి, ధర్మవరంలో ఒక్కొక్కటి చొప్పున మాతృ మరణాలు, సోమందేపల్లి మండలంలో 2, ధర్మవరంలో 1, రామగిరి, బత్తలపల్లి మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున శిశు మరణాలు చోటు చేసుకున్నాయని గుర్తు చేశారు. ఇందుకు గల కారణాలను ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ లోపాలను సరిదిద్దుకుని మరో సారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఐఓ కృష్ణయ్య, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెలివ్యా సోలోమాన్, ధర్మవరం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నజీర్, డాక్టర్.పద్మలత, హెచ్‌ఓడీ వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుప్పకూలి వృద్ధుడి మృతి

గుత్తి: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఓ వృద్ధుడు కుప్పకూలి మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... గుత్తి మండలం ఇసురాళ్లపల్లికి చెందిన జయప్ప (82) తన ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించేందుకు కుటుంబసభ్యులతో కలసి మంగళవారం ఉదయం గుత్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళితే.. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

14న రక్తదాన శిబిరం

ప్రశాంతి నిలయం: ఈ నెల 14న ఎనుములపల్లి వద్ద ఉన్న పీహెచ్‌సీలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్‌వీ కృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. రక్తంలోని గ్రూపులను కొనుగొన్న శాస్త్రవేత్త కార్ల్‌లాండ్ స్టీనర్ జయంతిని పురస్కరించుకుని ఏటా జూన్ 14న ప్రపంచ రక్తదాన దినాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. ఇందులో భాగంగా రక్తదానానికి విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సేవా సంస్థలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

పీహెచ్‌డీ దరఖాస్తుకు నేటితో గడువు పూర్తి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకునేందుకు బుధవారంతో గడువు ముగుస్తోంది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ జి.నరసింహులు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. యూజీసీ నెట్, సీఎస్ఐఆర్ నెట్.. గేట్ అర్హత సాధించిన వారు అర్హులు.

రేపటి నుంచి డిగ్రీ పరీక్షలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో యూజీ (బీఎస్సీ) ఐదో సెమిస్టర్ రెగ్యులర్, డిగ్రీ ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ మంగళవారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 37 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయి. అలాగే అనంతపురం, హిందూపురం, ఉరవకొండ, తాడిపత్రి కేంద్రాల్లో మధ్యాహ్నం నుంచి దూరవిద్య నాలుగో సెమిస్టర్ పీజీ, యూజీ పరీక్షలను నిర్వహించనున్నారు.

సజావుగా మెడికల్ ఆఫీసర్ల కౌన్సెలింగ్

అనంతపురం క్రైం: డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం జరిగిన మెడికల్ ఆఫీసర్ల నియామక కౌన్సెలింగ్ సజావుగా సాగింది. అభ్యర్థుల సర్టిఫికెట్లను డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి, ఫ్యామిలీ డాక్టర్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత, ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చెన్నకేశవులు నిశితంగా పరిశీలించారు. 14 స్థానాలకు గాను 10 మంది హాజరు కాగా, ఇందులో 8 మందికి నియామక ఉత్తర్వులు అందజేశారు. వీరికి రాయదుర్గంలో ఇద్దరు, కళ్యాణదుర్గం యూపీహెచ్‌సీ, శింగనమల, పామిడి, కళ్యాణదుర్గం, గుత్తి, హిందూపురం సీహెచ్‌సీలకు పోస్టింగ్ ఇచ్చారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

- ఉమ్మడి జిల్లాకు ఫస్టియర్‌లో 6, సెకిండియర్‌లో 7వ స్థానం

రాప్తాడు రూరల్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. మొదటి సంవత్సరం ఫలితాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా రాష్ట్రంలో 6వ స్థానం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 7వ స్థానంలో నిలిచింది. మొదటి సంవత్సరం విద్యార్థులు 24,331 మంది పరీక్షలు రాయగా 18,710 మంది (76.90 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 24,476 మంది పరీక్షలు రాయగా 20,008 మంది (81.75 శాతం) ఉత్తీర్ణత సాధించారు. మార్చిలో జరిగిన రెగ్యులర్ పరీక్షలకంటే సప్లిమెంటరీ ఫలితాలు మెరుగయ్యాయి.

- మొదటి సంవత్సరం ఫలితాలకు సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1,923 మంది విద్యార్థులకు గాను 763 మంది పాసయ్యారు. అలాగే కేజీబీవీల్లో 579 మందికి గాను 288 మంది, మోడల్ స్కూళ్లలో 712 మందికి గాను 291 మంది, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలల్లో 269 మందికి గాను 162 మంది, ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలల్లో 53 మందికి గాను 28 మంది, ఏపీ రెసిడెన్షియల్ కళాశాలలో 26 మందికి గాను 10 మంది, ఎయిడెడ్ కళాశాలల్లో 414 మందికి గాను 109 మంది, బీసీ రెసిడెన్షియల్ కళాశాలల్లో 66 మందికి గాను 43 మంది, ప్రైవేట్ పాఠశాలల్లో 6,063 మందికి గాను 2,498 మంది ఉత్తీర్ణత సాధించారు.
- ద్వితీయ సంవత్సరం ఫలితాలకు సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2,784 మంది విద్యార్థులకుగాను 1,351 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే కేజీబీవీల్లో 230 మందికి గాను 166 మంది, మోడల్ స్కూళ్లలో 765 మందికి గాను 360 మంది, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలల్లో 274 మందికి గాను 150 మంది, ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలల్లో 49 మందికి గాను 29 మంది, ఏపీ రెసిడెన్షియల్ కళాశాలలో 24 మందికి గాను ఆరుగురు, ఎయిడెడ్ కళాశాలల్లో 493 మందికి గాను 249 మంది, బీసీ రెసిడెన్షియల్ కళాశాలల్లో 42 మందికి గాను 27 మంది, ప్రైవేట్ పాఠశాలల్లో 6,064 మందికి గాను 2,688 మంది పాసయ్యారు.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న సప్పలమ్మ మూలవిరాట్



జ్యోతులను మోస్తున్న మహిళలు

ఘనంగా సప్పలమ్మ జాతర

హిందూపురం: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని కొట్నూరులో గ్రామ దేవత సప్పలమ్మ జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని మూలవిరాట్‌కు తెల్లవారు జామున 4 గంటలకు పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద ఎత్తున అర్చనలు జరిగాయి. స్థానికులతో పాటు, ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు జ్యోతులతో ఊరేగింపు తరలివచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం జంతు బలులతో మొక్కులు తీర్చుకున్నారు.